గురజాడ వీధి

# విధివంచిత

## వి. సుజాత

"నాకు చావాలని వుంది. అలాగని బతుకుమీద తీపి చావడం లేదు. అసలు నాకు కన్నీళ్ళే రావడం లేదేం? చెరిగిపోయిన చిరునవ్వు నా చిత్తరువును చెదిరిన స్వప్నంగా మార్చేసిందేం? మనసు మరణ వాంగ్మూలమైతే నా శరీరం ఇక చితాభస్మం ఐపోతుందేమో? ఏమిటో? ఏమో? నాకేమీ అర్థం కావడంలేదు...వెళ్ళిపోవాలి...నా చుట్టూ వున్న అనంత విశ్వం అందాలకు వీడ్కోలు చెప్పాలి. నా సుందర స్వప్నాల మేడమెట్ల మీద నుంచి ఆకాశగంగ అధఃపాతాళానికి దొర్లిపోతున్నట్టుగా వెళ్ళిపోవాలి. పెనుతుఫానుల ఉప్పెనల్లో సైతం ఫక్కున నవ్వుకుంటూ నడవగలిగిన నేను నా దారి నేను చూసుకుంటూ... నా పాటను నా గొంతులోనే నులిమి సాగిపోవాలి..." ఆ ఉత్తరాన్ని అప్పటికే పదిసార్లు చదివినప్పటికీ మళ్ళీ చదువుకున్నా. సౌమ్య రాసిన ఆ ఉత్తరం నా గుండె గది గదినీ పిండివేసింది. ఎంతో ధైర్యం గల పిల్ల. ఇలాంటి నిర్ణయిం తీసుకోవడానికి ఎంత నరకయాతన అనుభవించిందో...?

* * * * *

"కవితా! నీకు ఫోన్" ఉద్యోగుల సాలరీ బిల్లు చేస్తున్న నేను, నాకెవరు ఫోన్ చేశారబ్బా అనుకుంటూ.. సూపరింటెండెంట్ టేబుల్ వేపు నడిచా...

"హలో" నామాట కంప్లీట్ కానేలేదు..

"కవీ! నేను వీణను మాట్లాడుతున్నా... సౌమ్య లేదే...మనల్ని వదిలేసి వెళ్ళిపోయిందే" ఫోన్‌లో వెక్కిపడుతున్న వీణ గొంతును గుర్తుపట్టా..కానీ నాకేమీ అర్థం కావడం లేదు.

"ఏమిటే? ఏమైందే" అడిగా ఒకింత ఆందోళనగా.

"సౌమ్య కమిటెడ్ సూసైడ్! ఇక్కడ నాకంతా అయోమయంగా వుంది. నువ్వర్జంటుగా బయలుదేరి వచ్చేయి. వివరాలన్నీ వచ్చాక చెబుతాను..." ఫోన్ పెట్టేసింది వీణ... నా గుండెల మీద పెద్ద బరువును పెట్టేసి. ఎన్నేళ్ళ సాన్నిహిత్యం నాకు... సౌమ్యతో. అల్లరిగా, అందర్నీ నవ్విస్తూ, నవ్వుతూ తిరిగే సౌమ్య ఇక లేదంటే నమ్మశక్యం కావడం లేదు. ఫోన్ పెట్టేసి, నీరసంగా నా టేబుల్ వద్దకు నడిచా. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. నా టేబుల్ అంచులను అందుకుని, కుర్చీలో కూర్చోబోతుంటే అదిగో! రాలిపడిందో కన్నీటి బొట్టు. కాలం చెక్కిలిపై నుంచి జారిన ఆ నీటి బిందువు ఏ సింధువుల ఉనికికి అర్థం చెప్పాలనుకుంటున్నదో? జరిగిన పరిస్థితి ఆఫీసులో వారికి అర్థమైపోయింది. కమల చొరవ తీసుకుని, విషయం కనుక్కుని నాతో లీవ్ పెట్టించి ఇంటికి కూడా వచ్చి బట్టలు సర్దింది. గిరి, ప్రయివేటు బస్‌లో టికెట్ సంపాదించి తీసుకొచ్చాడు. రాఘవ, డబ్బులు సర్దాడు. నా ప్రమేయం లేకుండానే తిరుపతి బస్ ఎక్కా. కొలీగ్స్ చెబుతున్న ధైర్యం కూడా వినిపించుకోకుండా... అలసటగా సీట్ వెనక్కి వాలాను.

* * *

నేను ఒక భావుకురాల్ని. ఒకప్పుడు ప్రయాణం అంటే ఎంతో ఆనందించేదాన్ని. కానీ ఇవుడు, బస్ కిటికీలో నుండి కనపడే నిశీధి పరిమళాన్ని, నీరవ మహారణ్యపు సౌందర్యాన్ని ఆస్వాదించే స్థితిలో లేను. నా ప్రియ నెచ్చలి తాలూకు మృత్యు నేపథ్యం నా నిశ్శబ్దపు తేనెతుట్టెని తట్టి కలవర పెడుతున్నది. సౌమ్యా! ఎంత పని చేశావే? మాకందరికీ ధైర్యం చెప్పేదానివే! మరి నీవెందుకే ఇలా దారుణానికి ఒడిగట్టావు? నామనసు రోదిస్తోంది. ఝామ్మని హారన్ కొడుతూ, రయ్యిన పరుగెడుతున్న బస్ మీద, ఝంఝామారుతం లాంటి గాలి నా మనసును బలంగా సౌమ్య స్నేహపు జ్ఞాపకాల వేపు మళ్ళించాయి.

* * *

"ఇవుడు నేను కరుణశ్రీ పుష్పవిలాపంలోని కొన్ని పద్యాలు అడుగుతాను. ఎవరేనా చెప్పగలరా?" అడిగింది తెలుగు లెక్చరర్ రెండుజెళ్ళ సీత (అది ఆమె నిక్‌నేమ్. ఇంకా ఇప్పటికీ రెండు జడలు వేసుకుని కాలేజీకి వస్తుందని మా సౌమ్య ముద్దుగా పెట్టిన పేరది).


" అబ్బా! ఈ క్లాసు పరమబోరే! నటరాజ్‌లో స్కావెంజర్ పిక్చర్ వచ్చిందట, వెళ్దామే" నా చెవిలో గుసగుసగా అంది సౌమ్య. సౌమ్య, నేను, వీణ, రాగిణి, కావేరి ఐదుగురం ఒకే బెంచీలో కూర్చుంటాము. ఆ బెంచీ నలుగురు కూర్చునేదైనా.. ఐదుగురం సరిపోకున్నా, ఇరుకిరుకుగానైనా కూర్చుంటాము. మమ్మల్ని ఆ కాలేజిలో అందరూ పంచ కళ్యాణీ అని పిలుస్తారు. మేము ఆ బిరుదును ఆనందంగా రిసీవ్ చేసుకుంటాము. వీణ ఒక మధ్యతరగతి గుమాస్తా అమ్మాయి. పేరుకు తగ్గట్టుగానే దానికి సంగీతం పిచ్చి. మధ్యతరగతి బతుకుల్లో కోరికలు నెరవేర్చుకోవడానికి తావెక్కడ? అందుకే అది ట్యూషన్లు చెబుతూ, చదువు నెట్టుకొస్తుంది. మేము కూడా అప్పడప్పుడు అంతో, ఇంతో సాయం చేస్తుంటాము. రాగిణి ఒక పోలీస్ ఆఫీసర్ కూతురు. నాన్న చిన్నతనంలోనే చనిపోయారు. వాళ్ళ అమ్మ చాలా కష్టపడి, చదువుకుని, కానిస్టేబుల్ పరీక్ష రాసి సెలక్టయి అలా సర్కిల్‌గా ఎదిగిపోయింది. రాగిణి, తమ్ముడు ఇద్దరే. లైఫ్ అంతా ట్రాష్, పెళ్ళి, పిల్లలు ఒక గుదిబండ అంటుంది. ఒక మనిషి ఇష్టమైతే దానిని పెళ్ళి పేరుతో బంధించడం శుద్ధ వేస్టు అంటుంది. ఎవరి పిచ్చి వాళ్ళకానందం అని అనుకుంటూ వుంటాం మిగతా నలుగురం. కావేరి ఒక నది. బోలెడంత సహనం దానిలో. మా స్నేహపుతోటలో మాకు అపురూపంగా దొరికిన అందమైన గులాబీ కావేరి. దానికి తల్లీ, తండ్రీ అంతా మేమే. ఒకానొకరోజు, కాలేజీ బోటానికల్ టూర్‌కు వైజాగ్ వెళ్ళాము. భీమ్లీ సముద్రపు హోరులో నేను, రాగిణి, వీణ, సౌమ్య గవ్వలు ఏరుకుంటున్నాము. అలా ఏరుకునేటప్పుడు వచ్చే కెరటాల తాకిడి, నా మదిని చక్కిలిగింతలుగా తట్టివెళ్ళిపోతున్నాయి. ఆడి, పాడి అలసిన మేము ఓచోట కూర్చుని వేరుశెనగపప్పల్ని కొనుక్కుని



# కథానిక

తింటువ్నాము. అంతలో, ఒక అమ్మాయి, పరుగెత్తుకుంటూ వచ్చి, వెనకా ముందు చూసుకుండా సముద్రంలో దూకింది. మేమంతా నిశ్చేష్టుల య్యాము. మా అందరిలో ముందుగా తేరుకున్నది సౌమ్యే. అది గట్టిగా కేకలు పట్టింది. జాలరులు మూగారు. ఎట్టకేలకు కావేరిని బయటకుతీసారు. బతికించారు. మా టూర్‌లో వచ్చిన వాళ్ళతో మేము తిరిగి వెళ్ళలేకపోయాము. మా బాటనీ మేడమ్‌ను రిక్వెస్ట్ చేసి, రెండు రోజులు వుండిపోయాము. హాస్పటల్‌లో రికవరైన కావేరిని మేమెవరమూ ఏమీ గుచ్చి గుచ్చి అడగలేదు. కావేరికి ఎవరూ లేరని మాత్రం అర్ధమైపోయింది. నా ఇష్టాన్ని కాదవని అమ్మానాన్నల మనస్తత్వాన్ని అర్ధం చేసుకున్న నేను, నాతోపాటే కావేరిని మా ఇంటికి తీసుకొచ్చా. అలా కావేరి మాలో ఒకటిగా వుండిపోయింది.

**ఎదురు దెబ్బ తీసిన త్యాగం ఆమె బతుక్కి ఎలాంటి విషాద పరిణామాన్ని మిగిల్చిందో తెలుసా?**



## హాహాకూలు

అది కోటి ఓల్టుల
బల్బు కాదు
ఆయన
సూర్యుడు

***

ఓ కోయిల
తచ్చాడుతోంది
ఏదో అడగాలని
ఇళయరాజా ఇంటి వద్ద

***

ఆత్మహత్య
చేసుకుందామనుకున్నా
ఎక్కుదామంటే
రైలురాదేం

***

సిటీబస్సు వెనుక
పరుగెడుతున్నారు జనాలు
బోనులోంచి వదిలిన
ఎలుకల్లా

***

ఓ పిల్లపక్షి
ఆశ్చర్యంగా చూస్తోంది
విమానం కేసి
ఇదేం పక్షి అని

— లేపాక్షి

సౌమ్య...పేరులోనే కానీ మా అందరిలో ఎక్కువ గయ్యాళి సౌమ్యే. అస్సలు సౌమ్యమే లేదు. దానికి కోపం వచ్చినవుడు ఎర్రగా కందిపోయే దాని చెక్కిళ్ళు, అమ్మ ఒడిలో బజ్జుండడానికి వెళ్ళే పడమటి సూరీడులా వుంటాయి. మేము ఆట పట్టించినవుడు, రోషంతో అది ముక్కుపుటాలు ఎగురవేస్తుంటే నంది తిమ్మన సత్యభామ గుర్తుకు వచ్చేది. దాని కిష్టంలేనవుడు అది మా నుండి దూరంగా విసవిసా కదిలి వెళ్ళిపోతుంటే పాము బుసబుసా వెడుతున్నట్టుగా వుండేది. బుగ్గమీద సొట్టపడుతూ నవ్వుతుంటే, తన్మయత్వంగా మేమ లాగే చూస్తుండిపోయేవాళ్ళం. ఎప్పుడూ జోకులు వేస్తూ, జాలీగా జాయ్ కార్నర్‌లు, సినిమా థియేటర్లు తిప్పుతూ వుండేది. మా అందరికీ సౌమ్యంటే ఎంతో ఇష్టం. సౌమ్య పర్సనల్ విషయానికి వస్తే, అది, వాళ్ళ అమ్మ ఇద్దరే వుంటున్నారని, వాళ్ల నాన్నగారు వేరే ఆవిడను పెళ్ళి చేసుకున్నారని, ఏదో మాటల సందర్భంలో చాలా ముభావంగా చెప్పినట్టు గుర్తు. ఆ మాటలు చెప్పేప్పుడు వెలవెలబోయిన దాని ముఖం నేను ఎప్పుడూ మర్చిపోలేను. అప్పట్నుంచీ మేమెప్పుడూ దాని ఇంటి విషయాలు అడిగేవారం కాదు. ఫైనలియర్ ఎగ్జామ్స్ అయిపోయాక అందరం ఒకరిని పట్టుకుని ఒకరం బిగ్గరగా ఏడ్చాం. బాసలు చేసుకున్నాం. మా అందరికీ సౌమ్యే ధైర్యం చెప్పింది. అలా ఎవరి దారిన వారు విడిపోయిన మేము ప్రతి దీపావళి పండగకు ఎవరు ఎక్కడున్నా మా ఊరికి వచ్చేవారం. ఎందుకంటే దీపావళి అంటే మా అందరికీ అత్యంత ఇష్టమైన పండుగ కాబట్టి. మా ఐదుగురిలో కావేరి ఒక్కర్తే కష్టపడి లా చదివి, నంబర్ వన్ లాయరైంది. నేను ప్రేమించిన అజయ్‌ను, అమ్మానాన్నల ఇష్టప్రకారమే పెళ్ళి చేసుకున్నాను. రాగిణి తను అనుకున్నట్టుగానే తన కిష్టమైన వ్యక్తితో జీవిస్తోంది. వీణ, సౌమ్యలు పద్మావతి యూనివర్సిటీ హాస్టల్‌లో వుంటున్నట్టు ఒకసారి వీణ రాసిన ఉత్తరం ద్వారా తెలిసింది. గత దీపావళికి నేను మా ఊరికి వెళ్ళకపోవడంతో నాకు ఆ సంవత్సరం నా స్నేహితురాళ్ళను కలిసే అవకాశం పోయింది. మళ్ళీ దీపావళికి ఎలాగైనా వెళ్ళాలని తీర్మానించుకున్న నాకు సౌమ్య ఇక లేదన్న నిజం కాని నిజం ఆశనిపాతమైంది. నా ఆలోచనల్లో ఎప్పుడు నిద్రపోయానో.. ఎప్పుడు తిరుపతి వచ్చిందో తెలియలేదు.

* * *

"పద్మావతి హాస్టల్" ఆటోలో లగేజి పడేసి, ఎక్కి కూర్చుని చెప్పా.

ఆటో దిగిన నాకు వరండాలోనే వీణ ఎదురైంది. దాని మొహంలో కమ్ముకున్న విషాద ఛాయలు.. ఏడ్చి, ఏడ్చి ఎండిపోయిన కళ్ళు.. నాకు ఆందోళన కలిగించాయి. నా సూట్‌కేస్ అందుకుని దాని రూంలోకి దారితీసింది. నేను మౌనంగా అనుసరించా.

"బ్రష్ చేసుకో.. కాఫీ తీసుకొస్తా" హాస్టల్ కిచెన్‌లోకి వెళ్ళిపోయింది.

నేను బ్రష్ చేసుకుని, కాఫీ తాగేవరకు వీణ ఏమీ మాట్లాడలేదు.

"రిలాక్స్ అవుతుండు! నేను స్నానం చేసొస్తా" టవల్ భుజానేసుకుని వెళ్ళబోతుంటే వీణను వుండబట్టలేక అడిగేశా అసలేం జరిగిందంటూ.

"ఏమో! న్యూయియర్ సెలబ్రేషన్స్ కోసం హాస్టల్‌మేట్స్‌మంతా ప్రోగ్రామ్ వేసుకున్నాం. వార్డెన్ పర్మిషన్ కూడా తీసుకున్నాం. మొన్న ఆదివారంనాడు సౌమ్య అమ్మదగ్గరకు వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళింది. కానీ సోమవారం సాయంకాలం టూటౌన్ ఎస్‌ఐ హాస్టల్‌కొచ్చి, నా గురించి అడిగి, తనతో నన్ను తీసుకెళ్ళాడు. హాస్పిటల్‌లో మార్చురీవేపు తీసుకెళ్ళాడు. అక్కడ..."

ఇక చెప్పలేనట్టుగా దోసిలిలో ముఖం దాచుకుని బిగ్గరగా ఏడ్వడం మొదలుపెట్టింది వీణ.

నేను ఏమీ మాట్లాడలేదు. మొద్దుబారిపోయిన నా మెదడు ఆలోచించే స్థితిలో లేదు.

కొద్దిసేపట్లో అది తేరుకుంది.

"నాకేమీ అర్థం కాలేదు. నేనెలా హాస్టల్‌కు వచ్చానో తెలియదు. కాని సౌమ్య ఎందుకిలాంటి పని చేసింది? అసలు అలాంటి ఆలోచన వున్నట్టుగా కూడా కనిపించలేదు. ఎంక్వయిరీ చేస్తే సౌమ్య ఒక బ్రోతల్ అని తేలిందని ఎస్‌ఐ చెప్పాడు. నేను నమ్మనయ్యా! ఇదెలా సంభవం? నా కర్థం కానిదొక్కటే. ఏనాడూ సౌమ్య అలా బిహేవ్ చేయలేదు. రేణిగుంటలోని ఒక ప్రైవేట్ కంపెనీలో ఆఫీసర్‌గా పనిచేస్తున్నట్టు చెప్పింది. తరచుగా దానికి ఫోన్స్ వచ్చేవి. కానీ నేనంతగా పట్టించుకోలేదు. సౌమ్య నా రూమ్మేట్ అయిన కారణంగా వార్డెన్ నన్ను హాస్టల్‌నుంచి సస్పెండ్ చేసింది. ఒక రెండు రోజుల కోసం బతిమాలాను. వెంటనే నీకు ఫోన్ చేశాను" కాసేపు ఆపింది మాటల వేగాన్ని.

"అయితే..." నేనేదో అనబోయేంతలోనే "కవీ! నీకు ఈ ఉత్తరం వచ్చిందే. బహుశా సౌమ్య రాసిందనుకుంటాను. దానికి నువ్వు వస్తావని తెలిసే ఈ అడ్రస్‌కి రాసివుంటుంది" వీణ చేతిలోని ఉత్తరాన్ని గబుక్కున అందుకుని గబగబా చదివా...

"ఓ నా చిన్ని నేస్తమా!

శాశ్వత సెలవ్. నేను వెళ్ళిపోతున్నాను. తెగిపోయిన నా ఆశల తంత్రులను సరిచేసే ఓపిక లేక వెళ్ళిపోతున్నాను. నేన్నిజంగా అలసిపోయాను. బ్యూరోక్రసీ ముసుగు కప్పుకున్న మనుషుల మనసుల మధ్యలో.. వావీ వరుసలు తేడా తెలియని మృగాల్లాంటి మనుషుల మధ్యలో ఇమడలేక నేన్నిజంగా అలసిపోయాను. ఒకవేపు చావాలని వుంది. మరోవైపు ఆశాసౌధం నా కళ్ళముందు నాట్యం చేస్తూ, టెర్రస్ పైకి చేరుకోవాలంటే మెట్లయినా ఎక్కాలి లేదా నిచ్చెన ఆధారమైనా కావాలి, అలాంటివి లేకుండా ఆలోచన, విచక్షణ నశించి,

మూర్ఖంగా చేయకు అని హెచ్చరిస్తున్నది. ఏం చేయాలో పాలుపోవడం లేదు. నాకంటూ ఒక ఎయిమ్ వున్నది. నా ఈ విచక్షణ లేని మనసు, భావుకత్వం నీకు పిచ్చిలా అనిపిస్తే నేనేం చేయను? మీ అందరికీ తెలుసు. నాకున్న ఈ చిన్ని ప్రపంచంలో అమ్మ ఒక్కతే నా జీవితమని. మా జీవితాలను మాకే వదిలేసి వెళ్ళిన మా నాన్న అంటే నాకు అసహ్యం. పైపై నవ్వులతో, అల్లరిగా వుండే నేను, మా అమ్మ ఒక చిరుద్యోగి అని ఎన్నడూ చెప్ప లేదు. నాకెందుకో నామోషీగా అనిపించేది. అమ్మ పడుతున్న కష్టం చూసి, నాన్నపై పెరుగుతున్న కసి, అమ్మపై పెరుగుతున్న ప్రేమ నాలో ఇంకా చదువుకుని పైకి రావాలన్న ఆలోచనలకు నీరుపోసేవి. నా బాదను అధిగమించే ధైర్యం కోసం, నేను పెంచుకున్న ఆత్మవిశ్వాసం తరిగిపోనీకుండా మా అమ్మ నాకు ఉత్సాహం ఇచ్చేది. కానీ .. అమ్మ.. గోరుముద్దలు తినిపించిన మా అమ్మ, నాకోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన అమ్మ ఒకరోజు ఆఫీసులో కళ్లు తిరిగి పడిపోయింది. అమ్మను మళ్ళీ విధి కాటేసింది. బ్లడ్ కాన్సర్‌తో బాధపడుతున్న అమ్మను కనీసం మరో నాలుగేళ్ళపాటైనా బతికించుకోవడానికి.. అమ్మ బంగారు మాటలు వినడానికి నాకు డబ్బు కావాలి. నాకో మంచి ఉద్యోగం కావాలి. దానికోసం నేను ప్రతి ఆఫీసు తిరిగాను. బతిమాలాను. విషనాగులా భయపెడుతున్న హాస్పిటల్ బిల్లు.. చివరకు ఓపిక నశించిన హాస్పిటల్ సిబ్బంది అమ్మ పక్కను వార్డునుంచి వరండాలోకి మార్చారు. ఆ పరిస్థితుల్లో, దిక్కుతోచని ఆ స్థితిలో.. నాకు వీర్రాజ్ కనిపించాడు. నా అవస్థ గమనించాడు. నన్ను ఓ చోటికి చేర్చాడు. మినిస్టర్‌గారబ్బాయికి కన్నెపిల్ల కావాలట.. నాకు పదివేలు ఇస్తానన్నాడు. నాకు పదివేలు ఒక్కటే వినిపించింది. నాకు నా భవిష్యత్తు కనిపించలేదు. నాకు పాలిపోయిన చెక్కిళ్ళు.. అతుక్కుపోయిన అమ్మ శరీరమే కనిపించింది, నా అందమైన శరీరానికి బదులు. ఫలితంగా నేను ఒక క్లాస్ వన్ బ్రోతల్‌నయ్యా. వీణకు ఇవన్నీ చెప్పలేదు. ఆఫీసర్‌గా చేస్తున్నానని చెప్పా.. అమ్మను మద్రాస్ హాస్పిటల్‌లో జాయిన్ చేశా. ఒకరోజు వీర్రాజ్ చెప్పాడు.. ఆదివారంనాడు ఒక రాజకీయ నాయకుడి గెస్ట్‌హౌస్‌కు వెళ్ళాలని. 'అతన్ని నువ్వు ఆనందపరిస్తే.. నీ కష్టాలు తీరినట్టే. నిన్ను శాశ్వతంగా వుంచుకుంటాడు' అని అన్నాడు. నేను వాడి మాటలకు బాధపడలేదు. కాని నా జీవితం ఒక కొలిక్కి వస్తే చాలు అనుకున్నా.. నాకు అడ్వాన్స్‌గా ఇరవైవేలు ఇచ్చాడు. తీసుకున్నా. వెంటనే అమ్మ హాస్పటల్ బిల్లు కట్టేశా. ఆదివారం ఆ రాజకీయ నాయకుడి గెస్ట్ హౌస్‌కు వెళ్ళాను. అందంగా అలంకరించుకుని.. చీకటిగా వున్న ఆ రూమ్‌లోకి వెళ్ళాను. నా పెదవులను మరో బండ పెదవులకు అందించా నా మనసు సహకరించకున్నా. అంతలో ఒక్కసారిగా కళ్ళు జిగేలుమనేలా లైటు వెలిగింది. అనాలోచితంగా నేను ఆ వ్యక్తివైపు చూశా. నా తల వరాల్లో ఒక విస్ఫోటనం. అతను.. అతను కూడా అలాగే నిశ్చేష్టుడయ్యాడు. అక్కడ్నించి విసురుగా వెళ్ళిపోయాడు. ఒసే.. కవీ అతనెవరనుకున్నావే.. నా తండ్రి.. నను గన్న తండ్రే.. అధఃపాతాళానికి జారిపోయినా బావుండు.. నరకంలోకి వెళ్ళిపోయినా బావుండును. నాకు సిగ్గుతో చచ్చిపోవాలని వుందే. అందుకే ఏ అమ్మ కోసం నేను కష్టపడ్డానో ఆ అమ్మ మొగుడితో.. నేను పడుకోవడానికి అడ్వాన్స్ తీసుకున్నానని, ఆ డబ్బుతోనే అమ్మకు వైద్యం చేయించానని నా అమ్మకు తెలియకముందే నేను ఈ లోకం నుంచి వెళ్ళిపోవాలి.. కవీ! ఈ విషయాలు నీలోనే సమాధి చేసుకో. నన్ను అర్థం చేసుకో! మరుజన్మలో.. మీ స్నేహితురాలిగానే పుట్టాలని కోరుకుంటూ..."

ఉత్తరం పూర్తిచేసిన నా కళ్ళనుంచి నీటిబొట్లు టపటపా రాలిపడ్డాయి.

---

గురజాడ వీధి శీర్షికలో
ప్రముఖ ఉత్తరాంధ్ర
కథా రచయిత
ఎమ్. వి. వి సత్యనారాయణ
ఆంధ్రజ్యోతి కోసం
ప్రత్యేకంగా రాసిన కథ
'ఈశిల్పం శిల కాదు'
వచ్చేసంచికలో

---

వచ్చేవారం ప్రముఖ
బెంగాలీ రచయిత్రి
మహా శ్వేతా దేవి
అనువాద కథ
'ధీబర్'
అనువాదం
ప్రముఖ కవి త్రిపురగారి
శ్రీమతి ఆర్. వి లక్ష్మీదేవి.

---

## హైకూలు

1. విత్తనం మట్టి దుప్పటి
తడితడిగా నిద్ర
కళ్లు తెరిస్తే ఒళ్లంతా పచ్చదనం

2. ఎర్రటి పువ్వు కనబడింది
రైలు ఆగిపోయింది
ఈతోటలో ఇంకెన్ని ఎర్రపూవుతో?

3. మధువు
పక్కన కవిత్వం
సంపెగ చెట్టు కు తేనెపట్టు

4. అమావాస్యరాత్రి
ఆకాశం ఇల్లు ఖాళీగా ఉంది
టులెట్!

5. బయట చీకటి
లోపల నేను
దీపాల్లేని ప్రయాణం

6. రైలు వచ్చింది
చుట్టం కోసం
స్టేషను హడావిడి

7. ఆకాశంలో అన్ని రంగులుంటే
ఒకే ఒక్క రంగుతో పెయిటింగ్ చేస్తుంది
చీకటి.

—జియో లక్ష్మణ్